లఘుకథలు

## ఇంటిబాధ

మా సుబ్బారావు యిల్లు కడుతున్నాడు. పెద్ద నూలు మిల్లులో సూపరువైజరుగా వున్నాడు. మొదట్లో రెండు గదులువేసుకుని కాలక్షేపం చేస్తూండేవాడు. ఆఫీసు లోను వచ్చిందని మరో రెండు గదులు పెంచుదామని, ఎందుకైనా మంచిదని ఒకప్లాను గీయించి తానుండే ఏరియా, పంచాయితీకి ప్లాను శాంక్షను కోసం సమర్పించాడు.మూడేళ్ళయింది ప్లాను శాంక్షను కాలేదు. పంచాయతీలో బిల్డింగు యిన్స్పెక్టరు 'ఆమ్యా'కోసం తొక్కిపట్టాడు. ఎగ్జిక్యూటివ్ ఆఫీసరును కలిస్తే బిల్డింగ్ యిన్స్పెక్టరు నాకు పంపలేదండి. ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు



సమాధానం సుబ్బారావుతో ఆలోచన రేపింది. తీరా యిల్లు పూర్తయిం తర్వాత ఏం కొంప కూలుతుందో అని భయం. కారణం సుబ్బారావు మొదట్లో కట్టిన రెండు గదులకు ప్లాను అప్రూవ్ చేయించుకోలేదు. యిలా పని కాదని ఆ గ్రామంలోనే వున్న పాలకవర్గ పార్టీ నాయకుణ్ణి కలిశాడు. నాయకుడు నాలుగు నెలలు పడుతుంద న్నాడు. "నాలుగు నెలలే" అన్నాడు సుబ్బారావు. "అవునయ్యా! బిల్డింగ్ యిన్స్పెక్టరు అయోగ్యుడు.వాణ్ణి మూడు నిముషాల్లో పడగొడ్తాను. కాని ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు నిప్పులాంటి మనిషి. నువ్వేమో మొదట కట్టిన గదుల ప్లాను శాంక్షను చేయించుకోకుండా ప్రభుత్వం గుడ్డిదనుకుంటివి. మనం అయోగ్యులమే. ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు యీ నాలుగు నెలలో ఏదో ఓ చోట కాలు జారి 'అయోగ్యుడ'ని పేరు పడితే రోజుకో వంద తప్పుడు ప్లానులు అప్రూవ్ చేయిస్తానయ్యా! చూడు ఎంతైనా నీతి పరుణ్ణి మనమేం చెయ్యలేమయ్యా!" అన్నాడు నాయకుడు.

రాత్రంతా ఎంత చీకట్లో వున్నా తెల్లారితే సూర్యుడు రావడం నిజమన్నట్లు నీతి పెరుగుతూనే వుంది మన దేశంలో.

—చెరువు ఆంజనేయశాస్త్రి

అనుభవాలకోసం అర్రులు చాచే నేను ప్యాసింజర్‌లో మచిలీపట్నం వెళదామని నిశ్చయించుకున్నాను. ఎక్స్ప్రెస్ బస్సు ఎదురుగా వున్నా కాదని ప్యాసింజర్‌లో ఎక్కాను. పది నిముషాలు పరికించడంలో దాటి పోయింది. టైమ్ చూస్తే ఏడు దాటింది. ఆరూ నలభైకి బయలు దేరవలసిన బస్సు ఎంతకీ బయలు దేరదేం అనుకున్నాను మనసులో. చలిగాలి శరీరానికి తగులుతుంటే చీరను మరింత దగ్గరగా లాక్కొని భుజంచుట్టూ కప్పుకొన్నాను.

ఏడు దాటి పదిహేను నిముషాలయింది. ఇంకా ఆ డ్రైవరు కానీ, కండెక్టరుకానీ వచ్చే సూచనలు కనిపించ డంలేదు. ప్రయాణీకులు ఈ ఆలస్యాన్ని భరించలేక ఒక్కొక్కరకం డైలాగులు విసురుతూ, తిట్టుకుంటు న్నారు. కానీ పట్టించుకొనే నాథుడే లేడు. ఇంకాసేపు ఉంటే నేనూ అదే చేసేదాన్నేమో! కానీ ఇంతలో ఒక విశేషం. నడుముకు ఒక చిన్న తుండు ముక్క చుట్టు కున్న వ్యక్తి బస్సులో ప్రవేశించి అందరికీ పువ్వులు ఇవ్వడం ప్రారంభించాడు. ఏమిటో అర్థంగాక అయోమ యంగా చూస్తున్నాను. ఇంతలో వెనుకనుంచి "తీసుకోమ్మా!" అని ఎవరో చెప్పారు. సరేగదా అని తీసుకున్నాను. అందరికీ తలా ఒకటి ఇచ్చిన అతను తిరిగి

## "మంత్రపుష్పం"

మళ్ళీ దగ్గరకు వచ్చి వాటిని తిరిగి తీసుకోవటం ప్రారంభించాడు. గుడిలో మంత్రపుష్పం గుర్తు వచ్చింది ఒక క్షణం. పువ్వుతోపాటు డబ్బులు ఇమ్మని అడుగు తుంటే ప్రక్కనున్న గుడిలోని దేవుని పూలు తెచ్చి ఇస్తున్న అతి మంచివాడు అనుకున్న నా అనుమానం పటాపంచలయింది. అడుక్కోవటంలో రకాలు. మనిషి శుభ్రతగా ఉందా అంటే అదీ లేదు. తైల సంస్కారం లేని జుట్టు, నీరుగారిపోయిన తుండు ముక్క. ఓహ్. వర్ణించలేం. అసహ్యంతో పొమ్మన్నాను. అలా అన్నానే కానీ నా మనసు ఊరుకోలేదు. "అదే దేవుడి ముందు పూజారి పళ్ళెంలో అయితే భక్తిగా నమస్కారం చేస్తూ మరీ వేస్తారుగా—ఇక్కడ దేవుడు లేడనా" ప్రశ్నించింది నా అంతరంగం.

"అక్కడ ఉన్నాడు ఇక్కడ లేడు అని కాదు. ప్రజలను మోసంచేసి అడుక్కోవటం అనేది నా కిష్టముండదు. ఇలా నమ్మేవాళ్ళు ఉండబట్టే వీళ్ళు ఇలాంటి వేషాలు వేస్తున్నారు. నిజమైన వాళ్ళకు కూడా ఈ ఉద్దేశంలో ఇవ్వగలిగి ఉండి ఇవ్వటం మానేస్తున్నారు. కష్టపడకుండా అడుక్కోవటం సులభమని ప్రతివాడూ బిచ్చగాడూగా తయారవుతుంటే మనుషులలో జాలి కన్నా విసుగు ఎక్కువై మొదటికే మోసం వస్తుంది.

నా సమాధానం మొఖంమీద మొత్తినట్లు ఉందేమో ఠక్కున నోరు మూసుకుంది నా అంతరాత్మ.

—యలమర్తి అనూరాధ

## గురివింద గింజ

"మన సూర్యం లేడూ! వాడి దగ్గరికి వెళ్ళా లంటే నాకు చచ్చేంత భయం. ఎందుకంటే దగ్గర కొచ్చిన ప్రతి వాడినీ నిలబెట్టి గంటలు గంటలు మాట్లాడుతాడు. మాట్లాడే దాంట్లో పస వుంటుందా అంటే అదీ లేదు నస తప్ప. తన గురించి గొప్పలు చెప్పుకోవడమో, లేక మన ముందు వేరే వాళ్ళని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టడమో చేస్తాడు. వాడు చెప్పుకునే గొప్పలు వింటుంటే ఈ రెండు చెవులు దేముడెందుకు ఇచ్చాడా అనిపిస్తుంది. కానీ వదలడే! ఈ మధ్య వాడికి ప్రమోషను వచ్చిన దగ్గర్నుంచి ఒకటే



మిడిసిపాటు, గర్వం బాగా పెరిగిపోయింది. కళ్ళు నేల మీద ఆనట్లేదు. పెద్ద ఫోజు పెడుతూ ఆఫీసంతా తిరుగుతూ ఉంటాడు. ఎవరైనా కాస్త రిలాక్సవుతుంటే రెడ్‌హేండెడ్‌గా పట్టుకుందామనో ఏమో! వాడు పని చేస్తుండగా ఈ మధ్య నేను చూళ్ళేదు. వాణ్ణి నిన్న పొద్దుట ంచి సాయంత్రం దాకా గమనించాను. ఒక్క నిమిషం ఫైల్స్ చూస్తే ఒట్టు. పోనీ! వాడి యిల్లు దగ్గరే వుంది గదా అని వెడితే అక్కడ కూడా ఇదే సుత్తి. వాళ్ళావిడ పెట్టిన చింతకాయ పచ్చడి దగ్గర్నుంచి వాళ్ళ కుక్క బొచ్చు ఊడ్డం దాకా అన్నీ వినిపించి గానీ వదలడు. అందుకే--"

ఇదంతా తన రూంలోంచి వింటున్న సూర్యం టైం చూసుకున్నాడు. వెంకట్రావు ఆఫీసులో ఒక మోస్తరు పబ్లిక్ మీటింగ్ పెట్టి సుమారు పావుగంటైంది. తలనొప్పి పాపంలా పెరిగిపోయింది. తాను యాధాలాపంగా చెప్పిన విషయాల్ని ఇంతకు ఇంత చేసి చెబుతున్న వెంకట్రావుని చూసి గురివింద గింజను గుర్తు చేసుకున్నాడు.

—వేమూరి శ్రీధర్